అకాల వర్షం.. అస్తవ్యస్తం

- టార్గెట్ పెంచినా... పూర్తి స్థాయి ధాన్యం సేకరణ సాధ్యమా?
- మండలంలో వేలాది టన్నుల ధాన్యం రోడ్లు, డివైడర్లపైనే
- కేవలం 1500 మెట్రిక్ టన్నులకు పెంపు
- దీని వల్ల రైతులకు ఒరిగేది ఏమిటి?



భీమడోలులో దళారులకు ధాన్యం అమ్మేందుకు సిద్ధంగా ఉంచిన ధాన్యం బస్తాలు



వంతెనల వద్ద భద్రపర్చుకున్న ధాన్యం బస్తాలు

భీమడోలు: జిల్లాకు రబీ ధాన్యం సేకరణ లక్ష్యం పెంచినా... ఏ మేరకు రైతులకు మేలు జరుగుతుందోనన్న అనుమానం వ్యక్తమవుతుంది. మండలాల్లో రైతుల వద్ద పేరుకుపోయిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో వ్యవసాయ, పౌరసరఫరాల విభాగం అధికారులు కొనుగోలు చేస్తారా లేదా అన్న సందేహం రైతుల్లో వ్యక్తమవుతుంది. అకాల వర్షాల నేపథ్యంలో ఏ రోజు ఏ ముప్పు వాటిల్లుతుందోనన్న భయం రైతులు, కౌలు రైతులను వెంటాడుతుంది. దీంతో నష్టానికే రైతులు ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు వణికిపోతున్నారు. భీమడోలు మండలంలో 15వేల మెట్రిక్ టన్నులు నిల్వ ఉండగా.. జిల్లా సేకరణ పెంపుతో భీమడోలు మండలానికి 1500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు పెంచారు. ఈ పెంపు స్వల్పంగా ఉండడంతో కొంతమందికే మేలు జరగనుంది. రాజకీయ నాయకుల అండ ఉన్న రైతుల ధాన్యానికే ప్రాధాన్యత ఇస్తారని రైతులు వాపోతున్నారు. అయితే రైతుల నుంచి ధాన్యం పూర్తి స్థాయి కొనుగోలు సాధ్యం కాదని, ప్రభుత్వాన్ని నమ్మితే మోసపోవడం ఖాయమని భావించి రైతులు దళారులకు అయినకాడకు ధాన్యాన్ని అమ్మేసుకుంటున్నారు. ఒకొక్క రైతు ఏకరాకు రూ.3వేలు వరకు నష్టపోయారు. రబీ మాసూళ్ల సమయంలో రైతులు పండించిన ప్రతి గింజను కొంటామని కూటమి నేతలు ప్రగల్భాలు పలకగా...నేడు ఆ పరిస్థితి లేదు.

టార్గెట్లు మరింత పెంచాలి

అధనంగా కేవలం 1500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొంటామని చెప్పడం వల్ల రైతులకు ఒరిగేదీమీ లేదని రైతులు అంటున్నారు. 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు లక్ష్యం పెంచాలని రైతులు కోరుతున్నారు. దీనిపై భీమడోలు ఏడీఏ పి.ఉషారాజకుమారిను వివరణ కోరగా ఇప్పటికే మండలంలో 90శాతం ధాన్యం సేకరణ పూర్తి అయ్యిందని, రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులు విధిగా ఈ క్రాప్, ఈకేవైసీ చేయించుకోవాలని రైతులు, కౌలు రైతులకు తెలియజేసామన్నారు. కొంత మంది రైతులు చేయించుకోకపోవడం వల్లే సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేస్తామన్నారు.

రోడ్ల పైనే ధాన్యం.. రైతన్న దిగాలు

మండలంలో ధాన్యం సేకరణ లక్ష్యాలు పూర్తి కావడంతో రైతులు వద్ద ఇంకా ధాన్యం మిగిలి ఉంది. టన్నుల కొద్దీ ధాన్యాన్ని ఉంది. అయితే జిల్లా అధికారులు భీమడోలు మండలానికి అధనంగా 1500 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అవకాశమిచ్చారు. దీని వల్ల రైతులు, కౌలు రైతులు ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో ఆరుగాలం పండించిన పంటను ఏ విధంగానైనా అమ్మి అప్పులు తీర్చుకోవాలని దళారుల చుట్టూ ప్రదక్షణాలు చేస్తున్నారు. కొందరు కౌలు రైతులు తమ భూయాజమానులు ఈ క్రాప్, ఈకేవైసీ చేయించకపోవడంతో పంటను రైతు సేవా కేంద్రాల సిబ్బంది కొనుగోలు చేయడం లేదు. దీంతో ధాన్యాన్ని పలు చోట్ల రైతులు డివైడర్లు, రోడ్లపై భద్రపర్చుకున్నారు. దళారులు మాత్రం ప్రభుత్వం టార్గెట్స్‌లు ప్రభుత్వం పెంచితే కొనుగోలు చేసుకుంటామని, అదీ కూడా బస్తాకు రూ.50 నుంచి 60లు తగ్గించి కొనుగోలు చేస్తామని చెప్పడంతో ధాన్యాన్ని అయినకాడకు అమ్మేసుకుంటున్నారు. భీమడోలు మండలంలో 12,735 ఏకరాల్లో వరి సాగు చేయగా 63వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇప్పటివరకు 48వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇంకా కళ్లాలు, రోడ్లు, డివైడర్లు వద్ద ధాన్యాన్ని రైతులు ఉంచారు.

సీహెచ్‌సీ అప్తమాలిక్ ఆఫీసర్‌గా దివ్య



దెందులూరు: మండలలోని సీహెచ్‌సీ అప్తమాలిక్(కంటి వైద్యం)ఆఫీసర్‌గా దివ్య నియమితులయ్యారు. సోమవారం సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుందర్ కుమార్ మాట్లాడుతూ అప్తమాలిక్ (కంటి వైద్యం) ఆఫీసర్ దివ్య దెందులూరు సీహెచ్‌సీలో సోమ, మంగళ, బుధవారాల్లో విధులు నిర్వహిస్తారన్నారు .గురు, శుక్ర, శనివారాల్లో పోతునూరు పీహెచ్‌సీలో విధులు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. దెందులూరు సీహెచ్‌సీ, పోతునూరు పీహెచ్‌సీలలో ఇకపై ఉచితకంటి వైద్య పరీక్షలుసేవలు జరుగుతాయని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రాయితీపై పశువుల దాణా

దెందులూరు: మండలంలో తెల్లరేషన్ కార్డు కలిగిన పశువుల పెంపకం దారులకు 50 శాతం రాయితీతో పోషకాలతో కూడిన దాణా అందజేస్తున్నట్లు దెందులూరు మండలం పశువైద్య శాఖ అధికారి రామ్మోహన్‌రావు అన్నారు. సోమవారం కొవ్వలి పశువైద్యశాలలో ఆయన మాట్లాడుతూ ఒక్కో కుటుంబానికి గరిష్టంగా రెండు పెద్ద పశువులు ఒక దూడకు 90 రోజులుగాను 450 కేజీల దానాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఒక వెయ్యి వంద విలువైన 50 కేజీల బస్తాలు రూ.55లకే ఇవ్వటం జరుగుతుందన్నారు. పశుగ్రాసం కొరతను అధిగమించే అందుకే ఈ చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. మండలంలో తెలుపు రేషన్ కార్డు కలిగిన పశువుల పెంపకం దారులు 50 శాతం రాయితీ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని పోషకాలతో కూడిన దానాలు తీసుకువెళ్లాలని డాక్టర్ రామ్మోహనరావు తెలిపారు.

క్లుప్తంగా

విఘ్నేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ



స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ

దెందులూరు: మండలంలోని పెరుగుగూడెం గ్రామంలో దక్షిణాముఖ శ్రీ విఘ్నేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. శ్రీ పాటిమ్మ తల్లి ఆలయ చైర్మన్ యలమర్తి శ్రీనివాసరావు, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని అభిషేకాలు పూజలు ప్రదక్షణలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. విగ్రహ పున ప్రతిష్ఠ సందర్భంగా స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు.

పాకాకు గౌడ సంఘీయుల అభినందన

ఏలూరు (టూటౌన్): రాజ్యసభ సభ్యుడిగా ధ్రువీకరణ పత్రం స్వీకరించిన పాకా సత్యనారాయణను ఏలూరు గౌడ్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. భీమవరంలోని ఆయన స్వగృహం వద్ద కలిసిన గౌడ సంఘీయులు పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం నేతలు ఉప్పాల జగదీష్ బాబు, సూరి బాబు, వీరంకి పాండు, వీరమల్లు వెంకట సత్యనారాయణ, మొదుగుమూడి శివ రామకృష్ణ, మార్గాని రామ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహితీ సంబరాలు పోస్టర్ విడుదల



తెలుగు సాహితీ సంబరాలు పోస్టర్‌ను విడుదల చేసిన డీఈఓ వెంకట లక్ష్మమ్మ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈ నెల 10, 11 తేదీల్లో ఏలూరు మహలక్ష్మీ గోపాలస్వామి కల్యాణ మండపం వేదికగా శ్రీశ్రీ కళావేదిక సంస్థ వ్యవస్థాపక సీఈఓ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల కార్యక్రమాలు విజయవంతం కావాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి, డీఈఓ ఎం వెంకట లక్ష్మమ్మ ఆకాంక్షించారు. సంబరాల వాల్ పోస్టర్‌ను సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్, డీఈఓ కార్యాలయంలో డీఈఓ విడుదల చేశారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక ఏలూరు జిల్లా అధ్యక్షుడు శ్రీహరికోటి, ఉపాధ్యక్షుడు కొంతియాల కస్తూరి రావు, కో-కన్వీనర్ ఎంజే సుజయ్ కృష్ణ, శ్యామల హరికోటి, పురం అనురాధ తదితరులు పాల్గొన్నారు.

రూ.50 వేలు పరిహారం చెల్లించాలి

ఏలూరు (టూటౌన్): అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేల పరిహారాన్ని తక్షణం చెల్లించాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కురిసిన అకాల వర్షాల వల్ల ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాలతో పాటు కృష్ణా జిల్లాలో అనేక చోట్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. లక్షల టన్నుల ధాన్యం వర్షానికి తడిసిపోయిందని, తడిచిన, రంగు మారిన ధాన్యా న్ని ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మామిడి, జీడి మామిడి, అరటి, మొక్కజొన్న, కూరగాయలు, పొగాకు తదితర పంటలకు కూడా నష్టం వాటిల్లిందన్నారు. నష్టపోయిన రైతులను తక్షణం పంటల బీమా పథకాన్ని అమలు చేసి పరిహారం చెల్లించాలని కోరారు. పిడుగుపాటుకు ఏలూ రు జిల్లాలో ఇద్దరు వ్యక్తులు మరణించారని, వారి కుటుంబాలకు రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి ఎకరానికి రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు.

సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): చిన్నారుల్లో సృజనాత్మకతను పెంచడానికి రకరకాల అంశాలతో కూడిన హేలాపురి సమ్మర్ క్యాంపు అందరూ వినియోగించుకోవాలని పలువురు కోరారు. ఆదివారపు పేట ఏఆర్‌డీజీకే మునిసిపల్ హైస్కూల్‌లో ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం సంఘం సంయుక్తంగా నిర్వహిస్తున్న పది రోజులు సమ్మర్ క్యాంపులో సోమవారం కాగితాలతో బొమ్మలు చేయడం, బియ్యం గింజలపై అక్షరాలు రాయడం, కరాటే శిక్షణ, ఆహార నియమాలు గురించి వివరించారు. తేలిగ్గా తెలుగు గురించిన కొన్ని మెలకువలు తెలుగు, గణిత నిపుణులు వై.ఆనంద నాయుడు పరిచయం చేశారు. బియ్యం గింజపై 108 అక్షరాలు రాసిన ఐఎంజీ అవార్డు గ్రహీత దొర శివప్రసాద్ వివరించారు.

దివ్యాంగులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలి



దివ్యాంగులకు బియ్యం అందజేస్తున్న ఏలూరు ఎఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి

భీమడోలు: దివ్యాంగులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని ఏలూరు ఎఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి అన్నారు. గుండుగొలనులోని విఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో 66 మంది దివ్యాంగులకు నెలవారీ వితరణ సోమవారం కార్యక్రమం జరిగింది. గ్రామానికి చెందిన దాతలు వెలివెల కామయ్య, వెలివెల పల్లమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు దివ్యాంగులకు సన్నబియ్యం, పౌష్టికాహారాన్ని అందజేశారు. దివ్యాంగులకు పండ్లను పంపిణీ చేసారు. కుటుంబ సభ్యులు వెలివెల రాంబాబు, వెలివెల సాంబశివరావు, వెలివెల హరికృష్ణలు వారికి ఆర్థిక సాయం చేసారు. దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలను అందించాలని కోరు. దాతలను వారు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్దలు వగ్వాల శ్రీరామచంద్రమూర్తి, శివలంక రామకృష్ణ, మూడేడ్ల సింహాద్రి, కడగల లక్ష్మణరావు, సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

పలువురికి సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత



ఉంగుటూరులో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు: మండలంలోని సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్న పలువురికి సోమవారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు చెక్కులను అందజేశారు. ఉంగుటూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ధర్మరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో వివిధ ఆరోగ్య సమస్యలతో చికిత్స చేయించుకుని ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి తన వంతుగా సహాయం చేసేందుకు ఎల్లప్పుడు ముందుంటాన్నారు. దీనిలో భాగంగా ఈ విడతలో నియోజకవర్గానికి 19మంది లబ్ధిదారులకు రూ. 12.93 లక్షలు మంజూరు కాగా, 11 నెలల్లో సుమారు 119 మంది లబ్ధిదారులకు రూ. 1.24కోట్లు మంజూరు చేయించటం జరిగిందన్నారు. అనంతరం కూటమి నాయకులతో కలిసి లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు నియోజకవర్గ ముఖ్య నాయకులు, మండల, గ్రామా జనసేన,టీడీపీ అధ్యక్షుడు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వర్షపు నీటిలో అంగన్‌వాడీ కేంద్రం



వర్షపు నీటితో నిండిన అంగన్‌వాడీ కేంద్రం గది

ద్వారకాతిరుమల: మండలంలోని ఎం.నాగులపల్లిలో పాత పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని వర్షపు నీరు ముంచెత్తింది. ఆదివారం కురిసిన వర్షం కారణంగా కేంద్రంలోని గదిలోకి నీరు భారీగా చేరింది. దీంతో పిల్లలు, అంగన్‌వాడీ సిబ్బంది సోమవారం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. నీటితో నిండిన గదిలో కుర్చునే వీలు లేక పిల్లలను మరో చోట కూర్చోబెట్టాల్సి వచ్చింది. వర్షం కురిసిన ప్రతిసారి ఇదే పరిస్థితి నెలకొంటుందని స్థానికులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతులు చేయించడం గాని, లేదా మరో భవనంలోకి మార్చడం గాని చేయాలని కోరుతున్నారు.

క్షేత్రంలో అలరించిన కోలాట నృత్యాలు



అనివేటి మండపంలో కోలాట నృత్యాలు చేస్తున్న హరే శ్రీనివాస భజన బృందం సభ్యులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో పలు భజన మండలి సభ్యులు సోమవారం ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలోని శ్రీహరి కళాతోరణ వేదికపై కృష్ణాజిల్లా నందివాడ మండలం గోపాలపురానికి చెందిన వరసిద్ధి వినాయక కళా బృందం సభ్యులు, అలాగే అనివేటి మండపంలో తాడేపల్లిగూడెం మండలం కాగుపాడుకు చెందిన హరే శ్రీనివాస భజన బృందం సభ్యులు కోలాట నృత్యాలు ప్రదర్శించారు. చిన్నా, పెద్దా అంతా కలిసి అన్నమయ్య కీర్తనలు, గోవింద నామాలతో చేసిన ఈ నృత్యాలు చూపరులను అలరించాయి. కోలాట ప్రదర్శన అనంతరం వారంతా స్వామి, అమ్మవార్లను దర్శించారు.

శ్రీవారికి హంస వాహన సేవ



శ్రీవారికి హంస వాహన సేవ నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి 36వ నవాహ్నిక బ్రహ్మోత్సవ సహిత చతుర్వేద హవన ప్రయుక్త విమాన సుదర్శన కలశ ప్రతిష్ఠా మహా కుంభాభిషేకాల్లో భాగంగా సోమవారం స్వామివారికి హంసవాహన సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీ విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, చతుస్థానార్చన, మూలమంత్ర హవనాలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి ధన్వంతరీ హవనం, అనంతరం నిత్య పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి శాత్తుమురై నిర్వహించి తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. సాయంత్రం శ్రీ విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, చతుస్థానార్చన, మూలమంత్ర హవనాలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు శ్రీ వారికి హంసవాహన సేవ చేసి, నీరాజన మంత్రపుష్పాలు, శాత్తుమురై సమర్పించి తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. ఆలయ ముఖ్య అర్చకుడు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు పర్యవేక్షణలో యాజ్ఞిక బ్రహ్మలు జీవీవీ దీక్షిత్ స్వామి, కిళాంబి వేంకట పవన్ కృష్ణమాచార్యులు విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి సతీష్ కుమార్ నల్లూరి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



భీమడోలులో చిత్రలేఖనం పోటీల్లో చక్కగా చిత్రాలు గీసిన చిన్నారులు చిత్రంలో టీవీ ఉమామహేశ్వరరావు, మండే సుధాకర్‌లు



పూళ్లలో సామూహిక పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు



దెందులూరులో శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

భీమడోలు: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు చిత్రలేఖనం చక్కని కళ అని మానవత జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వర రావు అన్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఏడో రోజైన సోమవారం ఘనంగా కొనసాగాయి. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు అధిక సంఖ్యలో హాజరై నీతి కథలు చదివించడం, పుస్తక పఠనం, సమీక్షలు రాశారు. దీంతో శిక్షణ కార్యక్రమం ఉల్లాసభరిత వాతావరణంలో ఆద్యంతం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరైన తుమ్మల ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్‌లు ప్రసంగించారు. చిత్రలేఖనంపై ఆసక్తిని పెంచుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. నీతి కలలు, ఇంగ్లీషు గ్రామర్, గణితం, జీకేలపై విద్యార్థులు పట్టు సాధించేలా చిన్నారులకు అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పూళ్ల గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో చిన్నారులు సామూహిక పుస్తకం పఠనం చేశారు. గుండుగొలను గ్రంథపాలకురాలు జి.నాగమణి ఆధ్వర్యంలో చిన్నారులకు క్యారమ్స్, పుస్తకం పఠనం చేశారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలపై మక్కువ పెంచుకోవాలి

దెందులూరు: ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులకు విద్య, క్రీడలు కీలకమని పోతునూరు గ్రంథాలయాధికారి రాంబాబు తెలపారు. సోమవారం గ్రంథాలయంలో వేసవి వైజ్ఞానిక శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు చెస్, క్యారం బోర్డు, కోకో విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విద్య క్రీడల ప్రాధాన్యత పై సుదీర్ఘంగా అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి ప్రాథమిక స్థాయి నుంచి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. లక్ష్యాన్ని అధిగమించేందుకు నిరంతర సాధన క్రమశిక్షణ ప్రణాళిక ఎంతో ముఖ్యమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను వేసవిలో గ్రంథాలయ సంస్థ కల్పిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకునేలా క్రమం తప్పకుండా పంపించాలన్నారు. సెల్‌ఫోన్లకు వీలైనంత దూరంగా ఉంచేలా శ్రద్ధ వహించాలని సూచించారు.

కులగణనపై సానుకూలత హర్షణీయం

ఏలూరు (టూటౌన్): కుల గణనపై మోదీ ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం పట్ల ఓబీసీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి లక్కోజు అనిల్ ఆచార్య హర్షం వ్యక్తం చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే జాతీయ జనాభా లెక్కల్లో కుల గణనను చేర్చాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం తీసుకున్న మైలురాయి నిర్ణయాన్ని ఓబీసీ మోర్చా స్వాగతిస్తున్నట్టు తెలిపారు. 94 సంవత్సరాల తర్వాత ఈ ప్రక్రియను పునరుద్ధరించాలనే మోదీ ప్రభుత్వ నిర్ణయం పారదర్శకత, నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. 2010లో యూపీఏ హయాంలో, కుల గణనను పరిగణనలోకి తీసుకోవడానికి మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేశారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి, పారదర్శక గణన కాకుండా సర్వేను మాత్రమే నిర్వహించాలని ఎంచుకుని సమాజాన్ని మోసం చేసిందని ఆరోపించారు. సామాజిక, ఆర్థిక, కుల గణన (ఎస్‌ఈసీసీ) నుంచి వచ్చిన డేటా ఎప్పుడూ పూర్తిగా విడుదల కాలేదని తెలిపారు. కులగణనతో దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని అనిల్ ఆచార్య ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

కులగణన చరిత్రాత్మక నిర్ణయం

దెందులూరు: కులగణన నిర్ణయం చరిత్రాత్మకమని వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ముంగర సంజీవ్ కుమార్ అన్నారు. సోమవారం పైడిచింతపాడులో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీల కులగణన లేకపోవడం వల్ల బహుజనుల సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక రంగాల్లో న్యాయం జరగలేదని అన్నారు. కులం సామాజిక, సాంస్కృతిక, తాత్విక జీవన వ్యవస్థల నుంచి ఆయా కాలాల్లో పరిణామం చెందుతూ వచ్చి కుల నిర్మూలన దశకు చేరుకుందని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావించారని తెలిపారు. కులగణనే కాక ఆర్థిక గణన కూడా చేయగలిగితే దేశ సామాజిక ఆర్థిక పరమైన నిజమైన స్వరూపం బయటకొస్తుందని చెప్పారు. కుల గణన ఈ నిర్ణయంతో పుణాత్మకమైన మార్పు రావడం ఖాయమన్నారు. ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత పల్లెం ప్రసాద్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు తేర ఆనంద్ మాట్లాడుతూ బీసీలు, దళితుల్లో ఆర్థిక సామాజిక రాజకీయ చైతన్యం పెరుగుతుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. కులగడం నిర్ణయాన్ని బీసీలు, ఎస్సీలు, మైనారిటీలన్నీ స్వాగతిస్తున్నామని తెలిపారు.

ఇద్దరు చొప్పన ఉపాధ్యాయులను నియమించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రతి పాఠశాలకూ కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని, ఎలిమెంటరీ పాఠశాలలను యధాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం ఏలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ఏలూరు జోన్ శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా చేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ ఎలిమెంటరీ పాఠశాలలకు పూర్వ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేయాలని, ప్రతి పాఠశాలలోనూ తెలుగు మీడియంను సమాంతరంగా కొనసాగించాలని, ఏకోపాధ్యాయ పాఠశాలలు లేకుండా చర్యలు తీసుకోవాలని, 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఈలోపు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్ డీఏలను ప్రకటించాలని తదితర డిమాండ్ల సాధనకు ధర్నా చేశామన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు డీకేఎస్ఎస్ ప్రకాష్ రావు, నిడమర్రు మండల ప్రధాన కార్యదర్శి ఎం కొండయ్య, పెదవేగి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కృష్ణారావు, బాలాంజనేయులు, నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే. ఆనంద్, అబ్బ దాసరి శ్రీనివాస్, ఏలూరు రూరల్ ప్రధాన కార్యదర్శి తేళ్లూరి శ్రీనివాస్, నగర మాజీ అధ్యక్షుడు డి.కేదారేశ్వర స్వామి తదితరులు పాల్గొన్నారు.